ప్రజాశక్తి

Vol. 2, no. 34

(Feb. 6, 1947)

బెజవాడ, 1947

Record no. 683

Prajāśakti

Vol. 2, no. 34

(Feb. 6, 1947)

Bejavāḍa, 1947

Record no. 683

Regd. No. 4486

4 పేజీలు అణా

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 2] బెజవాడ 6-2-47 గురువారం [సంచిక 34

కొబ్బరినూనె ధరల నిర్ణయం

ప్రభుత్వ ప్రకటన

మద్రాసు, ఫిబ్రవరి 3

మద్రాసు ప్రభుత్వంవారు కొబ్బరి కాయలు, కొబ్బరి, కొబ్బరినూనెల గరిష్టధరలను ఈ క్రింది విధంగా నిర్ణయించారు: కొబ్బరికాయ:— వెయ్యి 1కి రు 170 లు కాయ ఒకటికి 3 అణాలు. కొబ్బరి:— మణుగు ఒకటికి టోకుధర 34-6-2, చిల్లరధర 120 తులాల వీశకు రు. 1—0—0, కొబ్బరినూనె:— 35 పౌనుల డబ్బా (డబ్బాతోసహా)టోకు ధర రు. 26-2-3, చిల్లరధర, వీశ 1కి రు. 2—7—0 అమ్మకంపన్ను ఈ ధరలకు చేర్చబడలేదు. (ఈ ధరలు మలబార్, దక్షిణ కనరా జిల్లాలకు వర్తించవు)

ఆలిండియా ట్రేడ్‌యూనియన్‌కాంగ్రెస్

వార్షిక సమావేశం

బొంబాయి, ఫిబ్రవరి 4

ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ 25 వ వార్షిక సమావేశం మృణాల్ కాంతిబోస్ అధ్యక్షతను కలకత్తాలో ఫిబ్రవరి 18 నుండి 19 వ తేదీ వరకు జరుగుతుంది.

ఈ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు 600 కార్మిక సంఘాలు అనుబంధ సంఘాలుగా వున్నాయి.

7 లక్షల 35 వేలమంది సభ్యులున్నారు. కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలు గూర్చి తీర్మానాలను ఈ సమావేశం చర్చించుతుంది.

రాజ్యాంగసభలో ప్రవేశించ చూడండి

లీగుకు గాంధీజీ సలహా

సాధుర్పుర్ (నౌఖలీ), ఫిబ్రవరి 3

గాంధీజీ నేడు ప్రార్థనసభలో రాజ్యాంగ నిర్మాణసభ విషయమై లీగుచేసిన తీర్మానం గూర్చి ఇలా ఉపన్యసించారు:

"కాంగ్రెస్ తీర్మానాన్ని నిజాయతీ లేదని ముస్లింలీగు భావించింది. అంతేకాక రాజ్యాంగ నిర్మాణసభలో జరిగినఎన్నిక మొదలైనవి చట్ట విరుద్ధమైనవనికూడ లీగు అభిప్రాయపడింది.

"ఒకరినొకరు నిజాయితీ లేనివారని దూషించుకోరాదు. పెద్దసంస్థలు పరస్పర ద్వేషులుగా భావించుకోవడం మంచిదికాదు. ఇందువల్ల మనకు స్వతంత్రానికి దారి ఏర్పడదు. రాజ్యాంగసభ ఎన్నికలు, చర్చలు అక్రమమని భావిస్తే కోర్టులో దావావెయ్యాలి. అలాకాకపోతే ఆరోపణకు అర్థంలేదు. నేను 1920 లో ప్రకటించినట్టుగా లీగు కోర్టులను గుర్తించకపోయేట్టయితే ఇక చట్టవిరుద్ధము అనే మాటేరాదు.

నిజాయితీని పరీక్షించండి

"రాజ్యాంగ నిర్మాణసభలో ప్రవేశించి, తమ అభిప్రాయాలన్నిటినీ చర్చల మూలాన చూర్పవలసిందని లీగునునేను కోరుతున్నాను. అది వారి కిష్టంలేకపోతే రాజ్యాంగసభ నిజాయితీని పరీక్షించమని, ఆ సభ ముస్లిం సమస్య నెలా పరిష్కరిస్తుందో చూడవలసిందని లీగుకు సలహా ఇస్తున్నాను. కత్తితో పాడిస్తామనే భావం లేకపోతే ఇలా చేయడం లీగుకూ దేశానికికూడ మంచిది. కత్తిమీద ఆధారపడాలన్నకోరిక వారికిలేదనుకుంటాను.

సభలో సవర్ణులుమాత్రమేలేరు

"రాజ్యాంగసభలో సవర్ణులు మాత్రమే ఉన్నారని లీగు అంటున్నది. సభలో నిమ్న జాతులు, క్రైస్తవులు, పార్సీలు మొదలైన భారత పుత్రుల మనుకునే వారందరూ ఉన్నారు. మిగత నిమ్నజాతుల ప్రతినిధులే కాక డాక్టరు అంబేద్కర్‌కూడ సభలో పాల్గొంటున్నాడు. సిక్కులు ఇంకా పాల్గొంటూనే ఉన్నారు. లీగుకూడ సభలోనే తమ పోరాటము సాగించాలి.

బ్రిటన్‌పై ఆశ కొంత తగ్గింది

"బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యాంగ సభను రద్దు చేయాలని లీగు కోరింది. బ్రిటన్ తమ స్వేచ్ఛంద ప్రణాళికను నిష్కపటంగా అమలు జరుపుతారనే ఆశ నాకుంది. కాని ఆ ఆశ కొంతతగ్గిపోయిందని నేనుఒప్పుకోకతప్పదు.

"బ్రిటిష్ ప్రణాళికకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు తాము స్వతంత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నప్పటికీ, ఆ ప్రణాళికను అనుసరించే బ్రిటిష్ ప్రభుత్వం నడవాలని నా అభిప్రాయం. భారతదేశంలో నిష్కపటంగా వ్యవహారం నడుపుతారన్న పేరు నంతటినీ బ్రిటన్ గంగలో కలపదని ఆశిస్తున్నాను.

"నేను లీగు రాజకీయాలను ప్రస్తావించవలసి వచ్చింది. ఇంతమాత్రాన హిందువులు ముస్లిములు ద్వేషులని భావించరాదు."

"కరాచీ లీగ్ తీర్మానంలో, రాజ్యాంగసభ చాల కమిటీలను వేసిందని, రహస్యంగా సమావేశాలు జరిపిందిగనక ఏమేమి నిర్ణయాలు, తీర్మానాలు చేసిందో తమకు తెలియడం కష్టమని తెలిపారు.

"రాజ్యాంగసభ ఏలాంటి రహస్య తీర్మానం చేయలేదు. రహస్య నిర్ణయాలేవీ లేవు. రాజ్యాంగ సభ రహస్య సమావేశంలో సభా నియమావళి, ఆయవ్యయ పట్టికలను మాత్రమే చర్చించాము. మిగతావన్నీ బహిరంగంగానే తర్వాత నిర్ణయించాము."

రహస్య నిర్ణయాలు చేయలేదు

రాజ్యాంగసభ కార్యదర్శుల ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4

రాజ్యాంగ నిర్మాణసభ కార్యదర్శులు ఇలా ప్రకటించారు:

సిక్కుల వీటో వాంఛ

రావల్పిండి, ఫిబ్రవరి 4

ఇక్కడ "నారంకారీ" సిక్కుల మహాసభ జరిగింది. క్రింది తీర్మానాలు చేసారు:

1. ముస్లింలు అల్పసంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలలో, ముస్లిములకు ఇచ్చినట్టే సిక్కులకు కూడ వీటో అధికారం బి గ్రూపులో ఇవ్వాలి.

2 అందరు అల్పసంఖ్యాకులకు, ముఖ్యంగా సంఘాలలో సిక్కులకు రక్షణలు కల్పించాలి."

ఈ సభకు ఉత్తర పంజాబు, సరిహద్దు రాష్ట్రం, కాశ్మీరంనుండి ప్రతినిధులు వచ్చారు.

స్టెర్లింగు నిల్వలు ఎగవేయడానికి ఎత్తు

కామన్సులో చర్చిల్ ప్రశ్నలు

లండన్, ఫిబ్రవరి 4

స్టెర్లింగు నిల్వల విషయమై ఏమి దేశాలతో సంప్రతింపులు సాగుతున్నాయని కామన్సుసభలో వచ్చిన ప్రశ్నకు డాల్టన్, ప్రభుత్వ పక్షంగా ఇలా అన్నాడు:

"ఇప్పుడు భారతదేశంతో ప్రాథమిక చర్చలు సాగుతున్నవి. ఇలాగే ఈజిప్టు ఇరాకులతో కూడ రాయబారాలు సాగుతాయి"

చర్చిల్: "భారదేశాన్ని సమర్థంగా భూ, వాయు, సముద్ర, రాజ్యాంగరంగాలలో రక్షించినందుకుగాను, బ్రిటిష్‌ప్రభుత్వం ఎదురు సూచనలు చేయ వీలున్నదని పూర్వం ఇండియా వైస్రాయి వ్రాశాడు; ఇదినిజమేనా?

డాల్టన్: "నాకు జ్ఞాపకంలేదు. కాని మీరు ప్రధానిగా ఉండినారు. కనుక నిజమే కావచ్చు

చర్చిల్: "ఈ అంశం రాయబారాల్లో తెస్తారా? అమెరికా మనకు అరువుకవ్వడ పద్ధతిలో చాల సౌకర్యాలు చేసింది. అయినప్పటికి దానిని వదల మిగిలిన మన నిల్వలను ఇండియా ప్రభుత్వానికి మార్చుతారా?

డాల్టన్: చర్చలు సాగేవరకూ వేచివుండాలి

చర్చిల్: "ఈసంగతి మనసులో వుంచుకుంటారా?

డాల్టన్, అందుకంగీకరించాడు. చర్చల వివరాలు ఆఖరున పార్లమెంటు ముందుంచుతామనికూడ చెప్పాడు.

ప్రభువుల సభలోకూడ స్టెర్లింగ్ నిల్వల విషయంవచ్చింది. ఇండియామంత్రి లారెన్సు ఇండియా, ఈజిప్టు మొదలయిన దేశాల రక్షణకే ఇంతగా బ్రిటన్ అప్పులపాలయిందని జగద్రక్షకునిలా మాట్లాడాడు. ఎలాగైనా ఇండియాకు రావలసిన స్టెర్లింగు నిల్వలను ఎగవేయాలని, కనీసం బాగా తగ్గించాలని సామ్రాజ్యవాదులు ఎలాఎత్తులు వేస్తున్నారో ఇందువల్ల బోధపడుతున్నది.

చీల్చి పాలించేవిధానం

బర్మాలో బ్రిటన్ ఎత్తులు

రంగూన్, ఫిబ్రవరి 4

బ్రిటిష్ ఆధిపత్యంక్రింద ఉన్న బర్మా సరిహద్దులలోని కొండజాతి నాయకులందరు గురువారం సమావేశ మవుతారట. ఈ సభకు బ్రిటిష్ అధినివేశ సహాయ కార్యదర్శి బాటమ్లీ వస్తాడు.

ఇండియాలో సంస్థానాధిపతులను ఉపయోగించినట్టే ఈ కొండజాతి నాయకులను బర్మాపై తమ పెత్తనానికి ఆధారంగా ఉపయోగించుకోవాలని బ్రిటన్ చూస్తోంది. ప్రత్యేకం ఈ ప్రాంతాలను ఒక ఫెడరేషన్‌గా ఏర్పర్చాలని చూస్తున్నారు.

బర్మాలో ఇండియా సేన వెనక్కు రప్పించడంలేదు

లండన్, ఫిబ్రవరి 4

భారతసేనలను విదేశాలలోని స్వతంత్ర పోరాటాల నణచేందుకు బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం ఉపయోగిస్తోంది. వెంటనే భారతసేనలను వెనక్కురప్పించాలని భారత ప్రజలందరూ వాంఛించారు. నెహ్రూ అలాగే చేస్తానని వాగ్దానంకూడ చేశాడు.

కాని బర్మాలోని భారత సేనలను ఉపసంహరించే అవకాశం లేదని బర్మాప్రభుత్వ విదేశాంగ కార్యదర్శి బిక్‌ఫోర్డు చెప్పాడు. వెంటనే భారత సేనలను వెనక్కు రప్పించాలని భారత ప్రజాకోటి వాంఛిస్తున్నది. ఈ వాంఛను, తన వాగ్దానాన్ని నెహ్రూ పాటించాలి.

జమీందారీల రద్దు తీర్మానానికి మద్రాసు కౌన్సిల్ ఆమోదం

సమస్యలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని రివెన్యూమంత్రి

మద్రాసు, ఫిబ్రవరి 3

జమీందారీ విధానం రద్దు చేయాలనే ప్రభుత్వతీర్మానం నేడు మద్రాసు కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

1884 భూస్వాధీన చట్టాన్ని అనుసరించి నష్టపరిహారం చెల్లింపబడాలని అహమ్మద్ ఇబ్రహీంగారు ప్రతిపాదించిన సవరణ ఓడిపోయింది.

చర్చలో సభ్యుల విమర్శలకు సమాధాన మిస్టర్ రివిన్యూ మంత్రి కరంతుగారిలా అన్నారు: "జమీందారీ విధానం మూలంగా రైతుల జీవితం ఆనందశూన్యంగా, దుఃఖభాజనంగా తయారయింది. ఎక్కడో ఒక జమీందారు ఒక ఆసుపత్రి పెట్టాడనిగాని, స్కూలు నడుపుతున్నాడనిగాని జమీందారీలు రద్దు చేయగూడదనడం, బ్రిటిష్‌వారు తంతి, తపాలా, రైల్వే సౌకర్యాలు చేశారుకాబట్టి వారిని ఇండియా వదలమనడం సబబు కాదన్నట్లే ఉంటుంది.

"1862లో దాదాపు 71 లక్షల రూపాయలు జమీందార్లు శిస్తు వసూలు చేసేవారు. పేష్కసు 47 లక్షలు చెల్లించేవారు. కాని యిప్పుడు పేష్కసు పెరగకుండానే శిస్తు 206 లక్షలకు పెంచారు. నష్టపరిహారాన్ని గూర్చి యోచించేటప్పుడు పై విషయాలు గుర్తించడం అవసరమవుతుంది. జమీందార్లు తమ అశ్రద్ధవల్ల చెరువులు, కాల్వలు ముణ్ణగువాటికి కలిగించిన నష్టం ముడరా [illegible] అది హెచ్చిన్నటికీ యివ్వ [illegible] ఉంటుంది" అని మంత్రిగారు అన్నారు.

[illegible] రద్దునుగూర్చి మాట్లాడుతూ [illegible] ఆలోచిస్తామని కరంతుగారు [illegible]

నిర్బంధ వ్యతిరేకంగా బెంగాల్లో సర్వవ్యాప్త సమ్మె

బెంగాల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ తీర్మానాలు

(మా విలేఖరి)

కలకత్తా, ఫిబ్రవరి 4

బెంగాల్ ప్రభుత్వం నిర్బంధవిధానం కొనసాగిస్తున్నది. ఇప్పటికీ 144 సెక్షన్ అలాగేఉంది. ఈనిర్బంధానికివ్యతిరేకంగాను, కలకత్తాలో వియట్-నామ్ దినోత్సవంనాడు అరెస్టయిన విద్యార్థుల కేసులు ఉపసంహరించవలసిందిగానుకోరుతూ బెంగాలుఅంతటా సర్వవ్యాప్తసమ్మె రేపు(5 వ తేదీ) మాత్రం జరుగుతుంది.

ఈ విషయమై బెంగాలు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యవర్గం ఫిబ్రవరి ఒకటవ తేదీ ఇలా తీర్మానించింది:

సమ్మెతో మతసమైక్యత ఏర్పడుతుంది

1. బెంగాలు కాంగ్రెస్ అధ్యక్షుడు సర్వవ్యాప్త సమ్మె గూర్చిన ప్రకటన పరిశీలించాము. సమ్మె మత విద్వేష పరిస్థితిని మరింత అధ్వాన్నంచేస్తుందని మేము అంగీకరించము. కార్మికుల ఐక్య కార్యక్రమం మత సమైక్యతను దృఢతరంచేస్తుందని మా నమ్మకం.

"144 వ సెక్షన్ తొలగించాలి. పోలీసు జులుం పోవాలి అన్న సర్వసమానవాంఛపై కార్మికులు, విద్యార్థులు మత, కుల వివక్షత లేకుండా సమ్మెచేస్తారు. వీరందరు పూర్తిగా శాంతియుతంగా కట్టుబాటుతో సమ్మెసాగిస్తారని మాకు విశ్వాసమున్నది. ఈ కార్యక్రమం ద్వారా మత విద్వేషకులకు వ్యతిరేకంగా శాంతిసమైక్యతలకై పాటుబడే శక్తులకు బలంచేకూరుతోంది.

"ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుతోకాని, బాధ్యతగల ఏ కార్మిక నాయకునితోకాని, అఖిలపక్ష కార్యాచరణ కమిటీతోకాని సంప్రదించకుండా, బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మెను వ్యతిరేకిస్తూ బహిరంగ ప్రకటన చేసినందుకు చాలా విచారపడుతున్నాము.

సర్వవ్యాప్త సమ్మెచేయాలి

2. "ఫిబ్రవరి అయిదవతేదీ సర్వవ్యాప్త సమ్మె జరగాలన్న మొదటి ప్రకటనను మేము పునరుద్ఘాటిస్తున్నాము. 144 సెక్షన్‌కు వ్యతిరేకంగా, జనవరి 21 (వియట్నాం దినోత్సవం)నాడు జరిగిన పోలీసు దురాగతాలకు అసమ్మతి సూచకంగా ఒకరోజు పూర్తిగా శాంతంతో, అహింసా వాతావరణంలో సర్వవ్యాప్త సమ్మె జరపాలి."

బెంగాల్ ప్రధాని ప్రకటన

బెంగాలు ప్రధాని షురావర్ది ఈసమ్మె విషయంలో వ్యతిరేకిస్తూ ప్రభుత్వం జాగ్రత్త వహించి పనిచేస్తుందన్నారు.

లాహోర్ లీగ్ నాయకుని అరెస్టు

లాహోర్, ఫిబ్రవరి 4

లాహోర్ పట్టణ లీగ్ అధ్యక్షుడు నవాబ్జాదా రషీద్‌అలీఖాన్, మరి 65 మంది, ఆర్డినెన్సును ధిక్కరించి పెద్ద ఊరేగింపును జరిపినందుకు అరెస్టు చేయబడ్డారు.

పోలీసు కారులో స్త్రీలపై బాష్పవాయు ప్రయోగం

ప్రభుత్వ కార్యాలయం ముందు ప్రదర్శనం చేసినందుకు నిన్న అరెస్టు చేయబడిన ముస్లిం స్త్రీలను 11 మందిని పోలీసులు కారులో ఎక్కించుకొని, పట్టణంబయటకు తీసుకుపోయారు. అక్కడ వారిని కారు దిగమని అడిగారు. వారు నిరాకరించారు. అందుపై పోలీసులు కారులోనే వారిపై బాష్పవాయువు ప్రయోగించారు. వారు రోడ్డుపై ఏడిపోయారు. తర్వాత ఒక ముస్లిం లీగ్ కారువచ్చి వారిని తీసుకుపోయింది.

షాహపూర్‌లో లాఠీచార్జి

నిన్న షాహపూరులో ఊరేగింపులు జరిగాయి. పోలీసులు లాఠీచార్జి చేశారు.

చినోట్‌లో అరెస్టులు

చినోట్ అనే ఊళ్ళో 21 మందిని అరెస్టు చేశారని పంజాబు ముస్లింలీగు కార్యాలయం ప్రకటించింది.

చునియాలో లాహోరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ప్రభుత్వం అరెస్టు చేసింది. అందరిలో నలుగురు లీగు వర్కర్లను అరెస్టుచేశారు. గుజరాత్‌లో ఊరేగింపుపై పోలీసులు లాఠీచార్జి చేశారు. కాసూరులో పూర్తిగా హర్తాళ్ జరిగింది. సాయంత్రం ఊరేగింపు, బహిరంగసభ జరిగింది.

ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా పాల్‌పాటర్‌లో జరిపినసభలో ముస్లింలీగ్ వర్కర్లను అరెస్టు చేశారు. సాయిల్‌కోటలో 31మందిని అరెస్టు చేసి తర్వాత 26 మందిని వదలివేశారు.

విభజన పనికిరాదు

పాలస్తీనా విషయంలో అరబ్బుల దృఢనిశ్చయం

లండన్, ఫిబ్రవరి 4

పాలస్తీనా సమావేశం యీరోజు మళ్ళీ జరిగింది. పాలస్తీనాను, యూదు, అరబ్బు రాజ్యాలుగా విభజించాలనే దృష్టితోవచ్చే ఏప్లానునూ అంగీకరించము అని అరబ్బు ప్రతినిధులు ఖచ్చితంగా చెప్పేశారు.

మూడు గంటలసేపు సమావేశం జరిగిన తర్వాత, సమావేశాన్ని కాలపరిమితిలేకుండ వాయిదావేశారు. సమావేశానంతరం బ్రిటిష్ అరబ్బు అధికారులు ఒక సంయుక్త ప్రకటన చేశారు.

పాలస్తీనాను ఏకఖండంగా గుర్తించాలనీ, యూదుల వలస రావడాన్ని ఇక పూర్తిగా ఆపివేయాలనీ, పాలస్తీనా రాజ్యాంగంలో యూదుల జాతీయ హక్కులు రక్షింపబడేలా ఒడంబడిక కుదుర్చుకోవాలనీ అరబ్బులు ఒక ప్లాను సూచించారు. ఈప్లాను ఒక్కటే న్యాయమైనదీ, ఆచరణ యోగ్యమైనదీ అని సిరియా ప్రతినిధివర్గ నాయకుడు ఒక పెద్ద రిపోర్టు చదివాడని పై ప్రకటన పేర్కొంది. పాలస్తీనాను విభజించాలనే దృష్టితో సాగే ఏ చర్చలోనూ తాము పాల్గొనబోమని అరబ్బు ప్రతినిధులు స్పష్టంగా తెలిపారు.

డాక్టరు జమాలీ, అరబ్బు లీగు కార్యవర్గం తరపున మాట్లాడుతూ, పాలస్తీనా విభజనను అరబ్బు దేశాలన్నీ ఏకగ్రీవంగా నిరాకరిస్తాయని తెలిపారు.

బెవిన్ మాట్లాడుతూ పాలస్తీనా విషయంలో బ్రిటిషు ప్రభుత్వం ఇంకా ఏలాంటి నిర్ణయానికీ రాలేదని అన్నారు. కాబట్టి గాభరా పడవద్దని బుజ్జగించాడట.

ప్రజాశక్తి

1947 ఫిబ్రవరి 6 : గురువారం

అసెంబ్లీ సభ్యుల కర్తవ్యం

ప్రజలు ఓట్లనిచ్చి తమ ప్రతినిధులుగా శాసనసభకు మిమ్ము పంపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పరిపాలన ఫలితంగా వచ్చిన కష్టాలను మీరు తీరుస్తారని, కనీసం అందుకై పోరాడుతారని ప్రజలు ఆశించు చున్నారు. కాంగ్రెస్ మంత్రుల హయాములో పౌరసత్వ హక్కులు పెంపొందుతాయని ప్రజలు ఆశించారు.

ప్రజల ఆశలు నిరాశలయ్యేటట్లుగా ఏకుగులా 'పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్సు'ను మద్రాస్ ప్రభుత్వం జారీచేసింది. శ్రీ వైద్యనాథయ్యర్ గారు అన్నట్లుగా "ఇదివరకు కాంగ్రెస్ ఎన్ని ఆర్డినెన్సులను ప్రతిఘటించిందో వాటన్నింటి లోని చెడును కలిపినప్పటికీ దీనితో సరితూగదు. పౌరసత్వాలకు యిది గొడ్డలి పెట్టు. కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు చెప్పినట్లుగా స్వాతంత్ర్యోద్యమంపైనే యిది గొడ్డలిపెట్టు.

ఈ ఆర్డినెన్సు పోలీసులకు ఎంత దారుణమైన అధికారాలు యిస్తూందో చూడండి:

(1) పోలీసులు ఎవరినైనా వారంటు చూపకుండా అరెస్టు చేయవచ్చు. విచారణ లేకుండా డిటెయిన్ చేయవచ్చు.

(2) ఏ యింటినిగాని, ఏ ఆస్తినిగాని పోలీసులు స్వాధీనం చేసుకోవచ్చు. అంటే, ప్రజాసంఘాల ఆఫీసులనుగాని, పార్టీ ఆఫీసులనుగాని నిషేధం చేయకుండానే పోలీసులు [illegible]కాలమైనా సీజు చేయవచ్చు.

(3) ఏ వ్యక్తినైనాసరే పోలీసులు తమ [illegible]మెచ్చిన పనిచేయమని నిర్బంధించవచ్చు.

(4) పత్రికలను ప్రభుత్వానికి ఇష్టంలేని [illegible]ములు ప్రచురించరాదని నిషేధించవచ్చు. [illegible] వ్యాసాలను, వార్తలను [illegible] చూపిగాని ప్రచురించరాదని ఆజ్ఞాపించవచ్చు. ఈ విధంగా పత్రికా స్వాతంత్ర్యం శూన్యమవుతుంది.

(5) కార్మిక సమ్మెలు, రైతు పోరాటాలు జరుగుతున్న ప్రాంతాల ప్రజలపైన సమిష్టి జరిమానాలు విధించవచ్చు.

ఈ విధంగా ప్రజల పౌరసత్వాలను పూర్తిగా నాశనంచేసే అధికారాన్ని ఆర్డినెన్సు పోలీసులకు అప్పగిస్తూంది. ప్రధాన మంత్రి ప్రకాశం పంతులుగారు ఆర్డినెన్సును సమర్థిస్తూ, పోలీసు రిపోర్టులపై ఆధారపడి కమ్యూనిస్టుపార్టీపై అనేక నిందలు వేశారు.

జమీందారులు, మిరాశీదార్లు రైతులను భూములనుండి తొలగించడంవల్ల రైతు పోరాటాలు వస్తున్నాయి. తిండి, బట్ట, కనీస జీవావసరాలకు సరిపోయే జీతాలు యివ్వనందున కార్మికుల సమ్మెలు వస్తున్నాయి. ప్రతి పోరాటంలోనూ పోలీసులు జమీందార్ల పక్షాన, పెట్టుబడిదారుల పక్షాన చేరుతున్నారు. తుపాకులు పేల్చుట, లాఠీచార్జీలు నిత్యకృత్యమయ్యాయి. అనేకమంది కార్మికుల, రైతుల ప్రాణాలు బలిఅయ్యాయి. సత్యమిలా వుండగా ప్రకాశం పంతులుగారు కమ్యూనిస్టులు దౌర్జన్యాలు రెచ్చగొడుతున్నారనీ, పోలీసులు శాంతిని కాపాడటానికి ఆర్డినెన్సు కావాలిసి వచ్చిందని వాదించుతున్నారు.

కమ్యూనిస్టు నాయకులను విచారణ లేకుండా డిటెయిన్ చేసి వారిపై లేనిపోని ఆరోపణలు చేయడం ప్రజాస్వామిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైన పని. ఉదాహరణకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1942 లో కాంగ్రెసు నాయకులను ఇదేవిధంగా చేశారు. జైళ్ళలో పెట్టి సమాధానం యిచ్చే అవకాశం లేనప్పుడు ఆరోపణలు చేయడం ప్రజాస్వామికంతులకు తగనిపని.

నిజంగా కమ్యూనిస్టులే దౌర్జన్యాలు చేస్తూ వుండే వారిపై కేసులు పెట్టి శిక్షించరాదా, విచారణలేకుండా డిటెయిన్ చేయవలసిన అవసరమేమి వచ్చింది? దీనినిబట్టే ప్రకాశం గారి ఆరోపణలన్నీ నిరాధారమైనవని రుజువు అవుతూంది.

అందుచే ప్రజా ప్రతినిధులైన శాసన సభ్యులు యీ నిరంకుశ ఆర్డినెన్సును రద్దు చేయాలి. కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు తీర్మానాన్ని పార్టీవిభేదాలు లేకుండా కాంగ్రెస్ లీగు సభ్యులంతా బలపర్చాలి. ఇలాంటి ఆర్డినెన్సునుగాని శాసనాన్నిగాని సహించమని తేట తెల్లంచేయాలి. పౌరసత్వాలను కాపాడాలి. గురువారంనాడు జరిగే చర్చలో శాసన సభ్యులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలని రాష్ట్రప్రజలందరూ ఎదురుచూస్తున్నారు.

రైతులకు వాగ్దానం - జమీందార్లకు హామీ

"ఈ రాష్ట్రంలో జమీందారీ విధానము రద్దుగావాలనే సిద్ధాంతాన్ని ఈ కౌన్సిల్ అంగీకరిస్తూంది, జమీందార్లకు, ప్రభుత్వానికి రైతుకు మధ్యవున్న యితర మనుష్యులకు వారి హక్కులు తీసుకున్నప్పుడు సముచితమైన నష్టపరిహారం యిచ్చేందుకై ఒక చట్టం త్వరలోనే చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూంది."

ఈ తీర్మానాన్ని గత నెల 31 వ తేదీన జరిగిన మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలు సమావేశంలో రెవెన్యూమంత్రి కె. ఆర్. కరంత్ గారు ప్రవేశపెట్టారు. తీర్మానంపై మాట్లాడుతూ కరంత్ జమీందారీదౌర్జన్యాలను చాల విపులంగా వివరించారు.

కాని నష్టపరిహారాన్ని యివ్వడాన్నిగూర్చి ప్రసంగిస్తూ కరంతుగారు, తమ ఉపన్యాసంలో ఇలా చెప్పారు: "అసలు వీళ్ళకు (జమీందార్లకు) ప్రతిఫలం ఇవ్వకూడదనే చెప్పవచ్చు. పన్నుల వసూలుపనికి పెట్టిన ఈ పెద్దమనుష్యులు చేసిన దౌర్జన్యాలను విచారణ చేయడానికి పూనుకుంటే ఈ జమీందార్లలో ఒక్కడూ దాటిపోలేడు. అయినా వారికి నష్టపరిహారం ఇవ్వాలనే అనుకున్నాం"

జమీందార్ల పుట్టుపూర్వోత్తరాలబట్టి, గత 200 సంవత్సరాల నుండి వాళ్ళు గావించే దోపిడీపరిపాలనబట్టి, వాళ్లకునష్టపరిహారం యివ్వనవసరం లేదంటూ ఒకప్రక్కన అంగీకరిస్తూనే, మరొకప్రక్క "నష్టపరిహారం యివ్వదలుచుకున్నాం."అనడం పరిహాస్యాంగావుంది. నష్టపరిహారాన్ని నష్టపరిహారంగాని హద్దుమీరలేనంత అమితమైన దోపిడీకి గురిచేసి రైతాంగం రక్తమాంసాలను పిండిన జమీందార్లకు నష్టపరిహారం ఇవ్వడం జమీందారీ పరిపాలన అనువించు కొంటుంది. రైతులకు అప్పులు తగ్గించడం తప్ప మరేమీగాదు. ఏమైనా నష్టపరిహారాన్ని గూర్చి ఆలోచించాలంటే దాన్ని పొందదగినది రైతులుగాని, జమీందారులుగాదు. జమీందార్లకు నష్టపరిహారం యివ్వరాదనే విషయాన్ని రైతాంగ శ్రేయోభిలాషులందరూ అంగీకరించారు. కాంగ్రెసు మంత్రివర్గం రైతాంగ కోర్కెను పాటించి తమ నిర్ణయాన్ని మార్చుకోవాలి.

జమీందారీ విధానం రద్దు కావాలనేది తీర్మానం మాత్రమే

నష్టపరిహారంలో జమీందారీ విధానాన్ని రద్దుగావించేందుకు కౌన్సిల్ తీర్మానానుసారం మూడు మాసాల్లో ఒక బిల్లును తీసుకొస్తామని కరంతుగారు వాగ్దానం చేస్తున్నారు. కాని యిప్పటికిప్పుడే జమీందార్లు – రైతుల మధ్య సంబంధాలను, ఉభయులకుండాల్సిన హక్కులనుగూర్చి నిర్వచిస్తూ "ఎస్టేట్సు లాండు రెవెన్యూ బిల్లు" నొకదాన్ని కాంగ్రెసు మంత్రివర్గం ప్రకటించింది. కొలదిరోజుల్లో శాసనసభలో పెట్టి చట్టంగా చేయనుంది. దీని ప్రకారం జమీందారీవిధానం 1802 నాటి శాశ్వత ఫైసలా పద్ధతి ప్రకారం శాశ్వత మొనర్చబోతున్నారు. బంజరు, స్వంత కమతం భూములు, జలాశయాలపై జమీందార్లకున్న పెత్తనం అట్లేవుంటుంది. జమీందార్ల స్వంత భూములలో కౌలుదార్లుగావున్న రైతాంగానికి జిరాయితీ హక్కు నిరాకరించబడింది. ఈనాందారీ రైతులకు అసలు యీ బిల్లే వర్తించదు. స్వంత కమతం లేక అనే పేర్లతో సృష్టించబడిన దొంగ రికార్డులన్నీ చెల్లుతాయి. ఆంధ్ర జిల్లాలలో అనేకచోట్ల జమీన్ రైతులు జిరాయితీ హక్కుల కొరకు జరుపుచున్న పోరాటాలన్నీ, వీటి మూలంగా ఎగిరిపోతాయి. జమీందారుదే పైచేయి అవుతుంది.

వీటన్నిటినిబట్టి ఎస్టేట్సులాండు రెవెన్యూ బిల్లు జమీందారీవిధానాన్ని 1801 నాటి పెటిల్ మెంటుపద్ధతిమీద స్థాయపర్చడానికే వుపయోగపడుతుంది గాని జమీందార్లను రద్దు చేయడానికి యేమాత్రం ఉపయోగపడదు.

ఒక ప్రక్కన జమీందారీ విధానాన్ని రద్దు చేయడానికి తీర్మానం, మరొకప్రక్క జమీందారీ ప్రయోజనాలను కాపాడుతూ బిల్లు - యిదీ నేటి కాంగ్రెసు ప్రభుత్వ విధానం. రైతులకు వాగ్దానాలు-జమీందార్లకు హామీలు యిదీ ప్రభుత్వ పంథా. జమీందారీ విధానాన్ని రద్దుచేస్తామని తీర్మానంచేసినా, అది కాగితం మీదనే వుండిపోతుంది. కాంగ్రెసు మంత్రివర్గం జమీన్ రైతులకు చేయనున్న చట్టము ఎస్టేట్సు లాండు రెవిన్యూ బిల్లు మాత్రమే. ఈ ఎస్టేట్సుమేరకుపోతే జమీందారీ విధానాన్ని రద్దుచేయాలని తీర్మానం, మరొక సభలో జమీందారీవిధానాన్ని స్థాయపర్చాలనే బిల్లు తేవాల్సిన అవసరంలేదు. ఈ అభిప్రాయాన్ని కాంగ్రెసు నాయకుడైన డాక్టరు టి. యస్. రాజన్‌గారు గూడ కౌన్సిల్ సమావేశంలో కరంతుగారి తీర్మానంపై మాట్లాడుతూ వెల్లడించారు.

రైతాంగంకోరేది జమీందారీరద్దు

రైతాంగం కోరేది జమీందారీలను రద్దు చేయుమనిగాని, స్థాయపర్చమనిగాదు. వాగ్దానాలలో గాక చేతలలో జమీందారీ విధానాన్ని రద్దుచేస్తూ బిల్లు తీసుకురావాలని కోరుతోంది. యెస్టేట్సు లాండు రెవెన్యూ బిల్లు స్థానే మూడు నెలలలో కరంతుగారు జమీందారీ విధానాన్ని రద్దుగావించడానికి తీసుకొస్తామని వాగ్దానం చేస్తున్న బిల్లును తక్షణం తేవాలని రైతాంగం కోరుతోంది. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక ద్వారా ప్రజానీకానికి గావించిన వాగ్దానాలను నెరవేర్చేందుకు మంత్రివర్గం కృషిచేసేట్లుగా కాంగ్రెసు శాసన సభ్యులు గట్టిగా పూనుకోవాలని, విజ్ఞప్తి గావిస్తున్నాను. ఎట్టి నష్టపరిహారం లేకుండా జమీందారులను, ఈనాములను, మొఖాసా వగైరా దోపిడీ విధానాలను రద్దు గావించుచూ బిల్లు తెచ్చేందుకు తీవ్రఆందోళన చేయవలసిందిగా రైతాంగాన్ని హెచ్చరిస్తున్నాను.

ఉపాధ్యాయుల కష్టాలు

తణుకు, జనవరి 31

తణుకు తాలూకా పంచాయితీబోర్డు ఎలిమెంటరీ స్కూల్సు టీచర్సు అసోసియేషన్ వారు క్రింది ప్రకటన చేస్తున్నారు:

పంచాయితీబోర్డు ఎలిమెంటరీ స్కూళ్ళ ఉపాధ్యాయులు తమకిచ్చే స్వల్ప వేతనములతో కుటుంబ పోషణ జరుగక బాధపడుచున్నారు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి యీ కష్ట దినములలో సంసార సాగరము నీదుటకు దుస్తరమను విషయము తమకందరకు విశదమే. అదియునుంగాక ఆ స్వల్ప జీతములైనను ప్రతి నెల సక్రమముగా రాక మేము పడుచున్న యిబ్బందులు అందరకు తెలిసిన విషయమే.

మేనేజిమెంట్లు వేరైనప్పటికిని ఉపాధ్యాయులందరు ఒకే తర్ఫీదును పొంది ఒకే వృత్తిలో ఒకే బాధ్యతతో తమ తమ విధులను యెన్ని కష్టముల కోర్చి యైననూ నెరవేర్చుచున్నారు. కాని బోర్డులు వారు ఒక్కొక్క మేనేజిమెంటు క్రిందనున్న ఉపాధ్యాయులకు ఒక్కొక్కవిధముగా స్కేల్సును యిచ్చుచు అందరిని సరిసమానముగాచూడక భిన్న భిన్నములుగా చూచుట న్యాయవిరుద్ధముగా వున్నది.

కాంగ్రెసు గవర్నమెంటువారు వచ్చి యీ మధ్య జీతములను పెంపుచేస్ని సందర్భంలో మా కష్టములను తెలుసుకొను స్వల్పమార్పులు చేసిరి. వీరుకూడ మమ్ములను సవతిబిడ్డలవలె చూచిరి ఇందు విషయమై అందరు మాకు చేయూతనొసగి గొప్పచెదురని ఆశించుచున్నాము.

నిరశనవ్రతం బూనిన ఉపాధ్యాయులకు తోడ్పడాలి

నర్సారావుపేట సెంటరుక్లాసు తీర్మానం

(1) కాంగ్రెసు మంత్రివర్గమువారు ఉపాధ్యాయులకు నిర్ణయించిన స్కేళ్ళకు అసంతృప్తి [illegible] కనీసము రు. 50 లకు తక్కువ లేకుండా స్కేళ్ళు నిర్ణయించవలసినదిగా మంత్రివర్గమువారిని కోరుతూ తీర్మానించడమైనది.

(2) గుంటూరు టీచర్లు చేయుచున్న నిరశన వ్రతమునకు యీ సెంటరు టీచర్లు సానుభూతిని జూపుచూ, ప్రభుత్వమువారు త్వరలో తగిన సానుభూతిని చూపకపోయిన యెడల మా సెంటరు తరుపున తగిన సహాకారము చేయుటకు తీర్మానించడమైనది.

రట్టు పెట్టకు కొంప

కోగంటి గోపాలకృష్ణయ్య

గుట్టు కాపాడుకో పెద్దన్నా!
రట్టుబెట్టకు కొంప మాయన్నా!
అలనాటి గర్జనతో ఆంధ్రకేసరివయ్యు
పలనాటి బాలునే మరపించితివి చరిత ॥గు॥

కవ్వించి, రొమ్మిచ్చి గదిమి పసజూపించి
దువ్వగా వైరి నిను తమ్ములను తరిమెదువె? ॥గు॥

ఆర్డినెన్సుకు నీవు హర్షించినావంటె
'భస్మాసురవరంబు' పగిది పరిణామమౌ ॥గు॥

జాతీయఖ్యాతియు, సంస్థ విఖ్యాతియు
తరతరంబు కింత తగ్గకుండా జూచి ॥గు॥

"నై"ప్రభువుపొత్తేల? మయసభకు జనుటేల?
పరప్రభులనే పొగడి ప్రజల కెడమగుటేల? ॥గు॥

కుద్దదద్దమ్మలకు మద్దత్తునిచ్చుటా?
కొరివితో తలగోకి కొంపనే యార్పుటా? ॥గు॥

దక్షించె చట్టమును దీక్షతో యెదిరింప
మత్తగజకుంభమును తుత్తునియజేయమే: ॥గు॥

కల్యసారధ్యంబు చెల్లనేరదు సుమ్మి
గమ్యమౌ స్వేచ్ఛకై రమ్మి జనవాజితో ॥గు॥

తాడేపల్లి గూడెంలో సర్వవ్యాప్త సమ్మె

కార్మికుల కోర్కెల ప్రకటన

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 2

ఇక్కడవున్న 6 బియ్యం, నూనె మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు, ఈ నెల 6వ తేదీ నుండి సమ్మె చేయడానికి నోటీసు ఇచ్చారు. ఎంతకాలంనుండి యజమానులతో సంప్రదింపులు జరిపినప్పటికీ, ఎంత ఆందోళన చేసినప్పటికీ ఫలితం లేకపోగా కార్మికులు ఈ నిర్ణయానికి రావలసి వచ్చింది. యజమానులు నోటీసు లేకుండా కార్మికులను పని నుండి తొలగించడం, పని కాలంలో ప్రమాదానికి గురియై అంగవిహీనులైన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఎగగొట్టడం, ఫ్యాక్టరీ చట్టాన్ని ఏ విధంగాకూడా పాటించకపోవడం, కార్మిక సంఘాలపై కత్తి కట్టడం కార్మికులను చాలా ఆందోళన పర్చింది. గత్యంతరము లేక సమ్మె నిర్ణయానికి రావలసివచ్చింది. ఈ క్రింది వాటిని నెరవేర్చవలసి దిగా కార్మికులు యజమానులను కోరుతున్నారు.

రు 31౹- నుండి, 60 వరకు కనీసజీతాలను ఏర్పాటుచేసి, నం॥ 1 కి 3 నుండి, 6 వరకు పెంచుతూ, జీతాల స్కేల్సు ఏర్పర్చవలసిందిగా కోరుచున్నారు.

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం, ఆ ప్రకటన జరిగినప్పటినుండి అధిక ధరల అలవెన్సు ఇవ్వాలనీ, సంవత్సరానికి 3 నెలల జీతం బోనసు ఇవ్వాలనీ, వారానికి గం 48 లు చొప్పున పనికాలం నిర్ణయించాలనీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇచ్చే సెలవులన్నీ ఇవ్వాలనీ ప్రతి 6 మాసాలకూ 2 జతల దుస్తులు ఇవ్వాలనీ, ఫ్యాక్టరీచట్టం, కార్మిక నష్టపరిహారచట్టం, వేతనాలచట్టాలను ఆచరణలో పెట్టాలనీ ప్రావిడెంటుఫండు గ్రాట్యూటీలను పెట్టాలనీ, కార్మికసంఘాన్ని గుర్తించాలనీ కోరుతున్నారు.

సుమారు 2½ మాసాలనుండి కార్మికుల్ని బైటకు వెళ్ళగొట్టి మిల్లును లాకౌటు చేసిన సత్యనారాయణ రైసుమిల్లు మేనేజరు చర్యను నిరసిస్తూ కార్మికులందర్నీ తిరిగి పనిలో సక్రమంగా ప్రవేశపెట్టుకొనుటకు అందరు మిల్లు యజమానులు సహాయం చేయవలసినదిగా కోరుతున్నారు.

మోటారు కార్మికుల సమ్మె

గుడివాడ, పామర్రు డివిజన్లలో

పామర్రు, ఫిబ్రవరి 3

గుడివాడ, పామర్రు డివిజన్ల మోటారు కార్మికులు యీ నెల 1 వ తేదీ అర్థరాత్రి నుండి సమ్మె సాగిస్తున్నారు. యీ సమ్మె జనవరి 26 వ తేదీన ప్రారంభంకావలసినది. కాని, జిల్లాకలెక్టరు, బస్సు యజమానులకు, వర్కర్లకు మధ్య రాజీచేయుటకు ఒక వారం రోజులు గడువు ఇమ్మన్నారు. అయినా కార్మికుల ప్రధానకోర్కెలలో పనినుండితొలగించిన వారిని చేర్చుకొనుటకు, ట్రాన్సుఫర్లు లేకుండుట—జీతాల పెంపువల విషయంలో యజమానులు అంగీకారానికి రానందున, గత్యంతరంలేక తమన్యాయమైన హక్కుల కొరకు సమ్మెప్రారంభించారు. గుడివాడ-నూజివీడు, గుడివాడ-ఏలూరు, గుడివాడ-బందరు, పామర్రు-పుప్పుచేరు-బంటుమిల్లి మొదలైన లైన్లమీదనున్న 50 బస్సులు సుమారుగా ఆగిపోయాయి. సుమారు 200 మంది పనివారు సమ్మెలో పాల్గొంటున్నారు.

సమ్మె చెడగొట్టడానికి యజమాని ఎత్తులు

లేబరు కమీషనరు విలంబనం

ఏలూరు, ఫిబ్రవరి 2

ఏలూరులో రైసుమిల్లులతో పాటు సమ్మె ప్రారంభించిన శ్రీ [illegible] పరమేశ్వరి ఆయిలు మిల్లులో యింకా సమ్మె సాగుతూనే వుంది. రైసుమిల్లుల యజమానులు 27 వ తేదీననే కార్మికులతో రాజీ పడినప్పటికీ, యీ మిల్లు యజమాని కొత్తమాను సీతారామయ్యగారు మాత్రం మొండి పట్టుదలతో, ఇంకా వర్కర్సును లొంగదీయాలని ప్రయత్నిస్తూనే యున్నారు. వర్కర్సును విడివిడిగాను, దొడ్డివారిగుండాను పిలిపించి ఆశలు చూపించి యేదోవిధంగా ఐక్యతను భగ్నం చేయ చూస్తున్నారు. కాని కార్మికులు యీ ఎత్తులను బాగా అర్థంచేసుకున్నారు.

ఇప్పుడొక క్రొత్తఎత్తు యెత్తారు. ప్రెసిడెంటు తప్ప అందరూ పనిలోకి రండి. మీరు కోరిన ప్రకారం జీతాలు చేస్తాను. అని వర్కర్సులో కల్లోలం పుట్టించ ప్రయత్నిస్తున్నారు.

కిట్టా సుబ్బారావుగారి ఆయిలు మిల్లులో తీసివేసిన 6 గురు పనివారిని తిరిగి పెట్టిస్తామనీ, లేబరు కమీషనరుగారు ఎస్టాబ్లిష్మెంటు ఆఫీసరుగారు చెప్పినదేమీ యింతవరకు జరుగలేదు. ఈ నెలాఖరులోగా వస్తానని చెప్పిన లేబరు కమీషనరుగారు కూడా రాలేదు.

ప్రజాభిప్రాయాన్ని త్రోసిపుచ్చడం ప్రకాశం మంత్రివర్గానికి భావ్యంకాదు

ఏకగ్రీవంగా ఆంధ్రనాయకుల అసమ్మతి

తెలంగాణా ప్రజల పోరాటానికి పెద్దదెబ్బ

నిజామాంధ్ర మహాసభ నాయకుల ప్రకటన

హైదరాబాదు, ఫిబ్రవరి 1

శ్రీ బద్దం ఎల్లారెడ్డి (ఆంధ్రమహాసభ అధ్యక్షులు) శ్రీ రావి నారాయణరెడ్డి (ఆంధ్ర మహాసభ ప్రధానకార్యదర్శి) గారలు యిలా ప్రకటిస్తున్నారు:

బ్రిటిష్ సామ్రాజ్యవాదం దేశీయసంస్థానాలలో తమ స్థానాన్ని మిలిటరీకేంద్రాలను బలపర్చుకోవడంద్వారా గట్టి పరుచుకుంటున్నది. సంస్థానాలు పెద్ద మిలిటరీకేంద్రాలుగా యెట్లు తయారవుతున్నవో, యుద్ధానికే తయారవుతున్నట్లు యెట్లు మిలిటరీసన్నాహాలు జరుగుతున్నవో సంస్థానవాసులమైన మాకు బాగాతెలుసు. ఇప్పుడున్న సైన్యాలే గాక కొత్తగా 10 వేలమంది తెల్లసైనికులను గూడా హైదరాబాదు సంస్థానంలోకి దిగుమతి చేయడానికి, ఈ మధ్యనే నైజాంప్రభుత్వానికీ బ్రిటిష్ ప్రభుత్వానికీ ఒక రహస్య ఒడంబడిక గూడ జరిగినట్లు తెలుస్తున్నది. అందుకొరకే మొట్టమొదట సంస్థాన ప్రజా వుద్యమాలను అణచడానికి సంస్థానాలన్నిటిలోను, బ్రిటిష్‌వారి ఆధిపత్యంలో పెద్ద యెత్తునదాడులు సాగించబడినవి.

ఇప్పుడు బ్రిటిషిండియాలో అతివాద పార్టీలమీదను, రైతులపైనా, కార్మికులపైనా, విద్యార్థులపైనా విరుచుకు పడుతున్నారు. మద్రాసు రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీపైనా, రైతు, కార్మిక సంఘాలపైనా యిప్పుడు జరుగుతున్న నిర్బంధవిధానం బ్రిటిషువారి పైప్లానులోని ఒక భాగమే. అయితే వారు ప్రజామంత్రుల చాటునుండి యిదిచేస్తున్నారు.

తెలంగాణా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి సోదరాంధ్రులు మమ్మల్ని బలపర్చుటానికి చాల ముందుకు వస్తున్నారు. ఈసమయంలోనే మద్రాసు రాష్ట్రంలో యీ ఆర్డినెన్సు రావడం, తీవ్ర నిర్బంధవిధాన మారంభం కావడం మూలానా, తెలంగాణ ప్రజలకు గూడ పెద్దదెబ్బేయైనది.

బ్రిటిష్ ఇండియాలోగూడ కమ్యూనిస్టులు తెలంగాణాలో మాదిరిగా ప్రజల కష్టాలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నారు. నైజాం నిరంకుశ ప్రభుత్వం మోపుతున్న యారోపణలే బ్రిటిష్ ఇండియాలో వీరిపై మోపబడుతున్నవి. ఈ రెండు చోట్ల చేయిస్తున్నది బ్రిటిషుసామ్రాజ్యవాదులే ననే విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి.

ప్రజల క్షేమం, దేశ క్షేమం జరుగాలంటే, మన స్వాతంత్ర్యం సాధించుకోవాలంటే యీ ఆర్డినెన్సునూ, నిర్బంధ విధానాన్ని మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని అరెస్టు చేయబడినవారిని వెంటనే విడుదల చేయాలి. పౌరసత్వాలను పునస్థాపితం చేయాలి.

శాసనసభలో యీ ఆర్డినెన్సు రద్దుకావలెనన్న వాదనను ఖండించుటకుగాను అధికారవర్గము వారు చెప్పిన మాటలు యుక్తియుక్తంగాలేవు. అధికారము వహించిన అత్త తానుకూడా కొంతకాలం కోడలుగావుండి అనుభవించిన బాధలు అంతలోనే మరచి, తన కోడలిని బాధించుటకు త్వరపడినట్లున్నది. అధికారులు చెప్పినట్లు క్రమశిక్షణ నెలకొల్పడానికి యీ ఆర్డినెన్సును విధించవలసివచ్చెనా? యిట్టి ఆర్డినెన్సులవలన ఏ పాపం పుణ్యమెరుగని ప్రజలు అందులో స్త్రీలు - బాల - బాలికలు కూడా అనవసర బాధలకు గురియగుచున్నారే కాని ఇష్టార్థంమాత్రం ఎంతమాత్రం నెరవేరదనిన్నీ ప్రజలలో ప్రభుత్వంవారి యెడల మరింత రోత యెక్కువగుటయే ఫలితమనిన్నీ అధికారవర్గంవారు గుర్తించి యీ అక్రమ - ఆర్డినెన్సును తక్షణం రద్దుచేసి తమ ప్రతిష్ఠను నిల్పుకొందురుగాక!

పత్రికా సంపాదకుల సంఘకార్యదర్శి ప్రకటన

బెజవాడ, ఫిబ్రవరి 4

ఆంధ్రరాష్ట్ర పత్రికా సంపాదకుల సంఘ ప్రధాన కార్యదర్శి, 'శ్రమజీవి' పత్రికా సంపాదకులు శ్రీ చిలకమర్రి సత్యనారాయణాచార్యగారు ఇలా ప్రకటించుచున్నారు:

ప్రజా ప్రతినిధుల పరిపాలనలో, పత్రికల మీద, పత్రికా ప్రతినిధులమీద పాతపద్ధతిని కారణం, నేరము, విచారణలేని నిర్బంధం ప్రయోగింపబడుట ప్రజా ఉద్యమానికి శత్రువని నా నమ్మకం. అందులో పత్రికా నిర్వహణంలో ఆరితేరిన ప్రజానాయకుడు ప్రకాశంప్రధానత్వంలో యిలాజరుగుట చాలా నిగ్గుకరము అని నా దృఢవిశ్వాసం.

సత్తెనపల్లి తాలూకా కాంగ్రెసు నాయకుడు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2

సత్తెనపల్లి తా॥ కాంగ్రెసుకమిటీసభ్యులు కె. వీరయ్యచౌదరిగారు యిలావ్రాస్తున్నారు:

ఒకప్పుడు మహా భయంకరముగా వర్ణించి ధిక్కరణకుగూడ వెనుదీయవలదని ప్రజలకు ప్రబోధించిన మన ప్రధానిగారు నేడు స్వయముగా బహుళ ప్రజానీకమునకు అసంతృప్తి కలిగించే ఆర్డినెన్సును స్వతంత్ర పోరాటములో భాగస్థులైన కమ్యూనిస్టులపై ప్రయోగించుట విచారకరం.

సాధ్యమైనంత త్వరలో ఈ దాబోప సంహరణ జరుగుతుందని ఆశించవచ్చునా?

భీమవరం తాలూకా కాంగ్రెసు నాయకుడు

యనమదుర్రు, ఫిబ్రవరి 3

భీమవరం తాలూకా కాంగ్రెసు కమిటీ సభ్యులైన శ్రీ చిరపురపు సింహాచలంగారు యీ విధంగా ప్రకటిస్తున్నారు:

నేడు ఆంధ్రదేశంలో రైతు, [illegible] యూనియను, చేనేత సంఘం, ప్రజాశక్తి ప్రెస్, ప్రజాశక్తినగర్‌ల పైన దాడిచేయుట ప్రజానాయకులను అరెస్టు చేయుట ప్రతిదేశభక్తుడూ, గర్హించవలసిన విషయం. ఇంతవరకూ ఏ ఆర్డినెన్సులకు వ్యతిరేకముగా కాంగ్రెసు పోరాటం జరిపిందో ఆ ఆర్డినెన్సు లను నేడు ప్రజాసంస్థలపై అమలు జరుపుట శోచనీయం.

వెంటనే కాంగ్రెసు మంత్రివర్గమువారు ప్రధాన పౌరసత్వ హక్కులను నాశనంచేసే "శాంతి రక్షణ" చట్టమును రద్దుచేస్తూ ఆఫీసులనుండి తీసుకుపోయిన రికార్డులను ఇచ్చివేస్తూ, ప్రజా నాయకులను విడుదల చేయాలని కోరుచున్నాను.

యువజన కాంగ్రెసు నాయకుని ప్రకటన

ఉయ్యూరు, ఫిబ్రవరి 2

గన్నవరంతాలూకా యువజన కాంగ్రెసు ఉపాధ్యక్షులు శ్రీ సున్నె శివరావుగారు యిలా ప్రకటిస్తున్నారు:

దేశమంతటా కమ్యూనిస్టు సోదరులపైనా, కొన్ని కొన్ని చోట్ల సోషలిస్టులపైనా జరుగుతున్న నిర్బంధవిధానాన్ని ప్రతి స్వాతంత్ర్య ప్రియుడు కూడా, వ్యతిరేకించవలసినదే. బ్రిటిషు సామ్రాజ్యవాద ఏజంటయిన, వైస్రాయి చెప్పు చేతుల క్రింద నడుచుకుంటున్న ప్రత్యేక పోలీసుశాఖ ద్వారా నడుస్తున్న యీ నిరంకుశ నిర్బంధవిధానాన్ని వేదిరక్తముగల భారతీయుడెవ్వడూ సహించి ఊరుకోలేడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్రను మనం భగ్నం చెయ్యాలంటే స్వచ్ఛంద జాతీయవాదులంతా పౌరసత్వ హక్కులపై జరుగుతున్న యీ దాడిని ఎదుర్కొనాలి. ఆర్డినెన్సు రాజ్యము అమలులోకి వస్తే మన దైనందిన సామాన్య జీవితమే భగ్నమవుతుంది. కాన కాంగ్రెసు శాసన సభ్యులంతా ఈ నిరంకుశఆర్డినెన్సును వ్యతిరేకించాలని కోరుతున్నాను.

రాష్ట్ర కళావంతుల నాయకుని ప్రకటన

మచిలీపట్నం, ఫిబ్రవరి 3

సుప్రసిద్ధ కాంగ్రెసు భక్తులు, ఆంధ్రరాష్ట్ర కళావంతులసంఘ నాయకులైన శ్రీ భాస్కర్ల గోపాలకృష్ణమూర్తిగారు ఇలా ప్రకటించుచున్నారు.

చిరకాలమునుండియు కాంగ్రెసు సంస్థ ఎట్టి నిరంకుశాధికారమును ఎదుర్కొనుటకు పోరాడుచుండెనో అట్టి నిరంకుశాధికారమునే కాంగ్రెసుప్రభుత్వం నేడు చలాయింపబూనుట చాల శోచనీయమైన విషయం.

మద్రాసు ప్రభుత్వం వెంటనే తాము అమలుజరిపిన పబ్లిక్ ఆర్డినెన్సును రద్దుపరచి, తమకు అనుమానంగల కమ్యూనిస్టు నాయకులను బహిరంగముగ విచారణ జరిపి, కాంగ్రెసు ప్రతిష్ఠను కాపాడగలరని నమ్ముచున్నాను.

ఫ్రెంచి ఇండియా కార్మికుల అసమ్మతి

పుదుచ్చేరి, ఫిబ్రవరి 1

ఫ్రెంచి ఇండియా లేబర్ ఫెడరేషన్ కార్యాలయంలో పుదుచ్చేరీలో వున్న 22 కార్మిక సంస్థల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఫ్రెంచి ఇండియా లేబరు ఫెడరేషన్ అధ్యక్షులైన కామ్రేడ్ వి. సుబ్బయ్యగారు సమావేశంలో ఉపన్యసించారు.

మద్రాసు ప్రభుత్వం జారీచేసిన 'ప్రజా శాంతి రక్షణ' ఆర్డినెన్సును తీవ్రంగా ఖండించుచూ వెంటనే అరెస్టు చేయబడిన కమ్యూనిస్టు, కార్మిక, కర్షక నాయకులను విడుదల చేసి, ఆర్డినెన్సును ఉపసంహరించుకోవలసిందిగా కోరారు. తమ తీవ్ర అసమ్మతిని తెలుపుతూ పండిత నెహ్రూకు, ప్రధాని ప్రకాశం గార్లకు టెలిగ్రాములు పంపించారు.

విద్యార్థుల నిరసన

పుదుచ్చేరి, ఫిబ్రవరి 1

జనవరి 28 వ తేదీన ఫ్రెంచి ఇండియా విద్యార్థి ఫెడరేషను యొజమాన్యమున పెద్ద బహిరంగసభ, అ. భా. విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు శ్రీ శ్రీనివాసన్‌గారి అధ్యక్షతను జరిగింది.

మద్రాసు ప్రభుత్వ నిరంకుశ ఆర్డినెన్సును తీవ్రంగా ఖండించుచూ తమ తీవ్ర అసమ్మతిని తెలియపరచారు.

గిడుగు సీతాపతిగారి హెచ్చరిక

బెజవాడ, ఫిబ్రవరి 4

సుప్రసిద్ధ ఆంధ్రభాషాపండితులు, గిడుగు సీతాపతిగారు (బి. ఏ. యల్. టి. డి. లిట్) క్రింది ప్రకటన చేస్తున్నారు:

ఇప్పుడు మన చెన్నపురి ప్రభుత్వంవారు అమలు జరుపుతూవున్న ఆర్డినెన్సుచర్యలను గురించి వార్తాపత్రికలలో నేను చదివినదిన్నీ, ఈ బెజవాడ ప్రాంతాలలో నేను విన్నదిన్నీ చూడగా ఘోరాతిఘోరములయిన పరిస్థితులు దేశంలో చెలరేగుతూవున్నట్లు తోచవది. కొంతకాలం యిట్టి ఘోరాలకు పాల్పడిన వారమే అవి ఘోషించిన కాంగ్రెస్‌నాయకుల పరిపాలనములో యిట్టి చర్యలు జరుగుట వంతవమా అని ఆశ్చర్యపడ్డాము. చెన్నపురి

ప్రకాశంగారి ఆర్డినెన్సు ప్రజలకు వ్యతిరేకం

వివిధ ప్రజానాయకుల ఖండన పరంపర

ఇటీవల మద్రాసు ప్రభుత్వం జారీచేసిన "ప్రజా శాంతిరక్షణ" ఆర్డినెన్సు, ఇన్ని యేండ్లుగా పోరాడి సంపాదించుకొన్న పౌరసత్వహక్కులపై దాడి అని, రాష్ట్రమంతటా అనేకమంది ప్రముఖులూ, వివిధ ప్రజాసంస్థలప్రతినిధులూ ఖండించుతూ ప్రకటనలు చేస్తున్నారు. ఆంధ్రదేశంలో కాంగ్రెసు, కమ్యూనిస్టు, మరి యితర రాజకీయ అభిప్రాయాలు గలిగినవారు— వారు, వీరననేల ప్రజాస్వామికాభిలాషులు - స్వాతంత్ర్య పిపాసులంతా ఒక్కుమ్మడిగా ఈ నిరంకుశ ఆర్డినెన్సు అక్రమము, అన్యాయమూ అనీ, దానిని వెంటనే ఉపసంహరించుకొని, అరెస్టు చేసిన కమ్యూనిస్టునాయకులను విడుదల చేయవలసిందనీ, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజాస్వామిక సిద్ధాంతాలనమ్మే కాంగ్రెసు మంత్రులకిది తీరనికళంకమని ఎలుగెత్తి చాటుతున్నారు. దేశభక్తులంతా యీ విషయంలో శ్రద్ధవహించి, ఈ నిరంకుశ ఆర్డినెన్సును ఉపసంహరించుకొని, అరెస్టుకాబడిన నాయకులందరినీ విడుదలచేసే వరకు ఆందోళన చేయవలసిందిగా కోరుతున్నారు.

స్థలాభావంచేత అన్ని ప్రకటనలను ప్రకటించలేకపోతున్నాం. ప్రకటనలను పంపించిన వారిపేర్లనుమాత్రం ఉదహరించుతున్నాం. క్షమించప్రార్థన.

—సంపాదకుడు.

(1) వి. వరదరాజులు, కార్యదర్శి రాజమండ్రి ప్రెస్‌వర్కర్సుయూనియన్, రాజమండ్రి

(2) ఎ. వి. సుబ్బారావు, కార్యదర్శి ఫ్యాక్టరీవర్కర్ల యూనియన్. ఏలూరు.

(3) దాసరి నాగభూషణరావు, మల్లవరపు రామకృష్ణరావుగార్లు అధ్యక్ష కార్యదర్శులు, కృష్ణాజిల్లా విద్యార్థి ఫెడరేషను.

(4) మారెళ్ళనరసింహారావు, కార్యదర్శి పశ్చిమ గోదావరిజిల్లా విద్యార్థి ఫెడరేషను.

(5) కాకరాలకామేశ్వరరావు, కార్యదర్శి తూర్పుగోదావరిజిల్లా, మోటారు వర్కర్ల యూనియన్.

(6) పిరాది ముత్యాలు, అధ్యక్షులు తూ॥ గోదావరి. మోటారువర్కర్ల యూనియన్.

(7) పొన్నూరు కైలాసపతి, అఖిల భారత ఆర్య, వైశ్య యువజన మహాసభ కేంద్రకమిటీ సభ్యులు.

(8) అంబళ్ళ సూర్యారావు కార్యదర్శి చిట్టవలస కాంగ్రెసు లేబరు యూనియన్, విజయనగరం.

(9) పడాల రామారావు కార్యదర్శి తూ॥ గోదావరి జిల్లా చేనేత పారిశ్రామిక సంఘం.

(10) వెంపటి రాధాకృష్ణ, ఆంధ్ర ప్రజా నాట్యమండలి, బెజవాడ.

(11) జాలాది రామకోటయ్య అధ్యక్షులు గన్నవరం తాలూకా రైతుసంఘం.

(12) కుందేటి సుబ్బారావు, అధ్యక్షులు దివి తాలూకా యాదవ సంఘం. విడుమోలు

(13) జి. శ్రీహరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కైకలూరుతాలూకా రచయితలసంఘం.

(14) గన్నె గంగాధరరావు, అధ్యక్షులు బెజవాడ తాలూకా రైతుసంఘం.

(15) అబ్దుల్ సమెద్, పట్టణ విద్యార్థి సంఘం, చీరాల.

(16) కస్తూరి కుటుంబరావు, సహాయ కార్యదర్శి ఆంధ్రరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘం.

(17) యస్. వి. రత్నం, కార్యదర్శి, తూర్పు గోదావరిజిల్లా యువజనసంఘం.

(18) వి. లక్ష్మణరావు, సిటీట్రేడ్‌యూనియన్ కౌన్సిల్, గుంటూరు.

(19) ఏలూరు దశరథరామయ్య, కార్యదర్శి, కొవ్వూరు తాలూకా రైతుసంఘం.

(20) సుంకర వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి, తిరువూరుతాలూకా రైతుసంఘం.

(21) బొమ్మిన నరసింహమూర్తి, కార్యదర్శి నరసపూరు పట్టణకాంగ్రెసుకమిటీ.

(22) కొల్లి లక్ష్మినారాయణ, అధ్యక్షులు, దివితాలూకా యువజనకాంగ్రెసు

(23) మండవ వెంకటనరసయ్య, కార్యదర్శి, ఆముదార్లంక గ్రామ కాంగ్రెసుకమిటీ

(24) అల్లూరు వెంకటకృష్ణారావు, మాజీ జిల్లాబోర్డు కాంగ్రెసుసభ్యులు, అంతర్వేది పాలెం.

(25) బండి లక్ష్మయ్యచౌదరి, కార్యదర్శి కంభంపాడు గ్రామకాంగ్రెసుకమిటీ.

(26) కొడాలి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి, యువజనకాంగ్రెస్, దెందులూరు.

(27) నందిమెళ్ళగు వెంకటేశ్వర శర్మ కాంగ్రెసువాది, మైలవరం.

(28) నాగు మోతు పిచ్చయ్య చౌదరి. కలపాడు.

(29) మందాల వెంకట్రామయ్య గ్రామ కాంగ్రెసు, గంగవరం.

(30) ఆట్లూరి పూర్ణచంద్రరావు, అధ్యక్షులు, నందిగామ తాలూకా యువజనసంఘం.

(31) గంటి రాజేశ్వరరావు కార్యదర్శి, జట్కా డ్రైవర్ల యూనియన్, విజయనగరం.

(32) కాట్రగడ్డ వెంకట్రామయ్య, అధ్యక్షులు పట్టణ విద్యార్థిఫెడరేషన్, ఏలూరు

(33) భూపతిరాజు జానికి రామరాజు కార్యదర్శి, భీమవరంతాలూకా రైతుసంఘం.

(34) కొల్లా వెంకటరత్నం, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆర్గనైజింగు కమిటీ సభ్యులు.

(35) మద్దాలి చలమయ్య, బెజవాడ తాలూకా కాంగ్రెసు కమిటీ మాజీ అధ్యక్షులు.

(36) యలమంచిలి వెంకట్రామయ్య, బెజవాడ తాలూకా కాంగ్రెసు కమిటీ మాజీ సభ్యులు.

(37) ఉప్పలపాటి కుమారస్వామి, చోడవరం.

(38) చల్లా కోటేశ్వరరావు, కార్యదర్శి, బాపట్ల తాలూకా రైతుసంఘం.

(39) డాక్టరు వి. బసవరాజు, ఎల్. యమ్. పి, టేకిశెట్టిపాలెం.

(40) ముదునూరి సోమసుందర శేఖర భూపాలరాజు–తూర్పుగోదావరిజిల్లాకాంగ్రెసు సభ్యులు.

(41) వెల్లంకి వెంకటేశ్వరరావు, కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర తోళ్ళ కార్మికసంఘ ఆర్గనైజింగు కమిటీ.

(42) సరిపెల్ల గోపాలకృష్ణమూర్తి, ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్-రాజమండ్రి.

(43) పొట్లూరు వీరరాఘవయ్య సహాయ కార్యదర్శి తాలూకా రైతుసంఘం, నూజివీడు

(44) అహమ్మద్ అబ్దుల్ రజాక్ ప్రచారక కార్యదర్శి, దివితాలూకా ముస్లింలీగు.

(45) కోనేరు హనుమంతరావు, బెజవాడ తాలూకా కాంగ్రెసుకమిటీ సభ్యులు.

(46) గంటా సత్యనారాయణమూర్తి, అధ్యక్షులు, అమలాపురం తాలూకా రైతు సంఘం.

(47) కానూరు బలరామయ్య, ఉపాధ్యక్షులు, కృష్ణాజిల్లా రైతుసంఘం.

(48) యస్. యమ్. బాషా, కర్నూలు జిల్లా రైతుసంఘ కార్యవర్గ సభ్యులు.

(49) బందెల బంగార్రావు, కార్యదర్శి కోఆపరేటివ్ పాలసప్లయిసొసైటీ, పెనుమదం. గ్రామయువజన కాంగ్రెసు అధ్యక్షులు.

(50) ముచ్చర్ల చినరెడ్డినాయుడు, యువజన కాంగ్రెస్ కార్యదర్శి, పెనుమదం.

(51) శ్రీమతి యమ్. రాజేశ్వరి, కర్నూలు పట్టణమహిళాసంఘ అధ్యక్షురాలు.

(52) దాసరి వెంకటేశ్వర్లు, రేపల్లె.

(53) పమిడిముక్కల రాఘవయ్య అధ్యక్షులు రేపల్లెతాలూకా యువజనసంఘం.

(54) ముత్యాల వీరరాజు, కార్యదర్శి స్టాలిన్‌నగర్ యువజనసంఘం-రాజమండ్రి.

(55) వేమూరి రాఘవయ్య, మేనేజరు 'జైహింద్' ఫాక్టరీస్ ఉప్పుగుండూరు.

(56) పి. వి. సుబ్రహ్మణ్యశర్మ ప్రధాన కార్యదర్శి పశ్చిమ గోదావరిజిల్లా యువజన సంఘం - తాడేపల్లిగూడెం.

(57) డాక్టరు అర్జా గన్ - మంగళగిరి.

(58) బి. యస్. బాలాజీదాసు - అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులు.

దేశమంతటా ఒకరోజు రైల్వే కార్మికుల సమ్మె

నెలాఖరులోగా అడ్జూడికేటర్ రిపోర్టు ప్రకటించకపోతే

బొంబాయి, ఫిబ్రవరి 4

ఈ నెలాఖరులోగా, రైల్వే కార్మికులకు రైల్వేబోర్డుకుగల తగాదా విషయమై అడ్జూడికేటర్ రిపోర్టును ప్రకటించని పక్షంలో, అసమ్మతిసూచకంగా దేశమంతటా ఒకరోజు సమ్మె చేయాలని, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఆలోచించుతూంది. ఈ విషయం రేపు ఢిల్లీలో చర్చించబడుతుందని ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఖెడ్గికర్ పత్రికా విలేఖరులకు తెలియజేశాడు. రైల్వేకార్మికుల పనిగంటలు తగ్గించాలి. రన్నింగ్‌స్టాఫ్‌కు జీతాలను నిర్ణయించాలి.-అనే కోర్కెలనుకూడా చర్చించుతారు.

రైల్వే కార్మికుల కోర్కెలను ఫిబ్రవరి 6 వ తేదీన, ఫెడరేషన్ కౌన్సిలూ, యజమానుల తరపున రైల్వేబోర్డువారిని జాయింటుగా చర్చిస్తారు.

కొండజాతులపై బాంబులు వేయము

ఢిల్లీ అసెంబ్లీలో నెహ్రూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3

కేంద్రశాసనసభలో సర్దార్ మంగళసింగు ఒక నిరసన తీర్మానం తెచ్చాడు. సరిహద్దు రాష్ట్రంలోని హజారాజిల్లాపై కొండజాతుల దాడులను భారత ప్రభుత్వం అరికట్టుటకు సకాలంలో పనిచేయలేదని ఈ తీర్మానం నిరసన తెలుపుతున్నది.

ఈ తీర్మానంపై పండిత నెహ్రూ ఇలా చెప్పాడు:

"ప్రభుత్వం బాగా ఆలోచించినమీదట, హజారా దాడిలో పాల్గొన్న కొండజాతి ప్రాంతాలపై బాంబులు వేయరాదని నిశ్చయించుకొంది. బాంబులు వేయడం మాకు ఇష్టం లేదు. వెంటనే సైన్యాన్ని పంపాము. తీవ్రమైన షరతులను కొండజాతులవారికి తెలియజేశాము. 75 వేల రూపాయలు, 75 తుపాకుల వన్ను, 40 పూచీకత్తు ఖైదీలను అప్పగించడం అనే షరతులు పెట్టాము.

"పూచీకత్తుగా మనుష్యులను అరెస్టుచేయడము అంత మంచిదికాదు. ("రాక్షసకృత్యమది" అని లీగు సభ్యుడన్నాడు.) రాక్షసకృత్యమైనా కొండజాతులుచేస్తున్న దాడులు కూడ ఇలాంటివే. ఈ దాడులకు, ఖూనీలకు మూలకారణాలు తొలగించాలి, కాని ఇవి జరిగినప్పుడు బలప్రయోగం అవసరం. విమాన దాడులతో ఎదుర్కోవాలా లేక సేనలను పంపాలా అనేది ఈ సభవారే నిర్ణయించాలి".

నవాబ్ సిద్దిక్ అలీఖాన్ కొండజాతి ప్రాంతాలపై వేసిన పన్నులను, రాక్షసంగా పూచీకత్తు ఖైదీలను పట్టుకొనే పద్ధతిని ఖండిస్తూ, తెచ్చిన నిరసన తీర్మానంపై నెహ్రూ ఇలా అన్నాడు:

ప్రభుత్వ విధానం మారాలి

"ఒకరు చర్య తీసుకోలేదని, మరొకరు తీవ్రచర్య తీసుకున్నారని ప్రభుత్వాన్ని ఖండిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు సభ్యులందరూ ఖండించవలసినవే. ఈ ఘటనలను ఆపాలంటే ప్రభుత్వం ఒక దీర్ఘకాల విధానాన్ని లక్ష్యంలో పెట్టుకొని పనిచేయవలసి ఉంటుంది. కాబట్టి ఈ సమస్యను సమగ్రముగా ఆలోచించి ఏదో ఒక విధానాన్ని సిద్ధ యించాలి.

"ఈ అంశాన్ని తీర్మానరూపంలో తెస్తే చర్చకు నాకేమీ అక్షేపణలేదు. కాని ఒక నెల క్రిందట జరిగిన ఈ ఘటన ఎంతపెద్దదైనా ఇప్పుడు చర్చించవలసిన అవసరంలేదు."

తర్వాత మంగళసింగు తెచ్చిన నిరసన తీర్మానాన్ని అధ్యక్షుడు త్రోసివేశాడు.

ప్రజలపై సేనలనుపయోగించరాదు

ప్రజల పౌరహక్కులను అణచేందుకు కేంద్ర ప్రభుత్వం సేనలను పంపడంఖండిస్తూ, అహ్మద్‌జాఫర్ తెచ్చిన నిరసన తీర్మానం కూడ అధ్యక్షుడు త్రోసివేశాడు. పంజాబు ప్రభుత్వం సేనలను పంపమని కోరిందని, ఇజాంజీనానికి బాధ్యత రాష్ట్రప్రభుత్వందేనని రక్షణశాఖ కార్యదర్శి చెప్పాడు.

బెంగాలులో సమ్మెల ముమ్మరం

కలకత్తా, ఫిబ్రవరి 4

కలకత్తాలో పోలీసుల నిర్బంధవిధానాన్ని నిరసించుతూ ఫిబ్రవరి 5 వ తేదీన సర్వవ్యాపిత సమ్మెచేయాలని బెంగాల్‌రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తీర్మానించింది.

ఇదే సమయాన, 15 రోజులక్రితం ఇచ్చిన సమ్మెనోటీసు ననుసరించి, కలకత్తా పోర్టుట్రస్టు పనివారల సమ్మెకూడా నేడు ప్రారంభమవుతుంది. 22 వేలమంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. కార్మికులను పనిమంది తీసివేయరాదనీ, జీతాలను పెంచాలనీ వీరు కోరుతూ సమ్మె చేస్తున్నారు.

ఇదివరకే 15 వేలమంది డాక్ (రేవు) పనివారలు కలకత్తాలో సమ్మె చేస్తున్నారు. ట్రామ్వే కార్మికులు 8 వేలమంది ఇదివరకే సమ్మె ప్రారంభించారు. బెంగాల్ అంతటా ఇప్పటికి 60 వేలమందికార్మికులు వివిధసమ్మెలలో పాల్గొన్నారు.

బ్రిటిష్ ప్రణాళికను నిరాకరించాలి

పంజాబు విద్యార్థి ఫెడరేషన్ తీర్మానం

లాహోరు, ఫిబ్రవరి 3

పంజాబు విద్యార్థి ఫెడరేషన్ వార్షికోత్సవం ఇక్కడ జరిగింది. ఈ క్రింది తీర్మానాలు సభలో ఆమోదింపబడినవి.

1. "రాజ్యాంగ నిర్మాణసభ సభ్యులు, బ్రిటిష్ ప్రణాళికను నిరాకరించాలి. సామ్రాజ్యవాదంపై పోరాటం సాగించాలి. భారత ప్రజలు సంపూర్ణ స్వతంత్రం సాధించిన తర్వాత, నిజమైన ప్రజాపరిషత్తును ఏర్పర్చాలి."

2. "ఆజాద్ హింద్‌ఫౌజ్, భారత నావికా సమ్మెకు చెందిన ఖైదీలను, ఇంకా జైళ్ళలో ఉన్న ఇతర రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి."

రేడియో ప్రోగ్రాం

ఆంధ్ర ప్రజా నాట్యమండలి రాష్ట్ర దళంచే

పల్నాటి వీరచరిత్ర

బుర్రకథ

వారు:
ఏపూరి రామకోటేశ్వరరావు
కోసూరి పున్నయ్య

9—2—47 సా॥ 6-20 లకు ఆదివారం

లీగు వర్కర్లకు రెండేళ్ళ శిక్ష

లాహోరు, ఫిబ్రవరి 3

హర్బర్టన్‌లో శనివారం అరెస్టయిన 11 మంది లీగువర్కర్లకు ఒక్కొక్కరికి రెండేళ్ళు శిక్ష, వందరూపాయల జరిమానాను షేక్‌పుర మాజిస్ట్రేటు విధించాడు.

పడమటి ఆసియాలో బ్రిటిష్ మిలిటరీ చర్య

లండన్, ఫిబ్రవరి 2

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బంటు అయిన ట్రాన్సుజోర్డాన్ రాజు ఇటీవల 'విశాలసిరియా' అంటూ కలవరింతలు ప్రారంభించాడు. సిరియా, లెబనాన్‌లను ట్రాన్సుజోర్డాన్‌తో కలిపివేయడమే ఇతని ఉద్దేశం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, ఇతనిద్వారా తమ ఈ దురాక్రమణ ఉద్దేశాలను వెల్లడిచేస్తున్నారు.

కైరోలో ఒక పత్రిక ఇటీవల ఈ రహస్యాన్ని బయటపెట్టేసరికి, ట్రాన్సుజోర్డాన్ రాజు అబ్దుల్లా 'అబద్ధం' అన్నాడు.

కాని, ట్రాన్సుజోర్డాన్, బ్రిటన్ సైనికులు కలిసివున్న కొన్ని సైనికదళాలు లెబనాన్-పాలస్తీనా సరిహద్దు ప్రాంతంలో సైనికవిన్యాసాలు సాగిస్తున్నాయనీ, ఆసందర్భంలో చాలసార్లు లెబనాన్ సరిహద్దు దాటివచ్చాయనీ, 'షాట్ అష్షార్' అనే లెబనాన్ పత్రిక ప్రకటించింది. లెబనాన్ ప్రభుత్వం వెంటనే తగినచర్య తీసుకోవాలని కోరింది.

సామ్రాజ్యవాదుల ఏజంటు టర్కీ

మాస్కో, ఫిబ్రవరి 3

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, మధ్య ఆసియాలో తమ మిలిటరీ, రాజకీయ ఎత్తుగడలకు టర్కీ, ట్రాన్సుజోర్డానులను సాధనాలుగా ఉపయోగిస్తున్నారు. సోవియటుకు వ్యతిరేకంగా పడమటి ఆసియా కూటమిని నిర్మించాలని వీరి ఉద్దేశం. ఈ ఉద్దేశంతోనే ఈమధ్య టర్కీ ట్రాన్సుజోర్డానులు ఒక ఒడంబడిక కుదుర్చుకున్నాయి. ఈ ఒడంబడికలోకి ఇతర అరబ్బుదేశాలను కూడా చేర్చడంకోసం టర్కీ ప్రభుత్వ ప్రతినిధులు సంచారం ప్రారంభించారు.

"టర్కీ నాయకత్వంక్రింద టర్కీ-అరబ్ దేశాల కూటమిని నిర్మించాలనే ప్లానుకు సంబంధించినవే ఈ సంచారాలు," అని అరబ్బు పత్రికలు ఖండిస్తూ చేసిన వ్యాఖ్యానాలను మాస్కో రేడియో ఈవేళ ప్రసారించింది.

"తమ స్వప్రయోజనాలకోసం కొన్ని సామ్రాజ్యవాద వర్గాలు సాగిస్తున్న పన్నాగాలకు అరబ్బుదేశాలన్నీ గురి అవుతున్నాయి," అని మాస్కో-రేడియో వివరించింది.

"విదేశ దండయాత్ర ప్రమాదం ఇంకా ఉందనే, అర్థంలేనివాదనతో టర్కీప్రభుత్వం, నేటి శాంతి సమయంలోకూడా పదిలక్షల సేనను సిద్ధంగా ఉంచింది. దేశంలోని ప్రజాసంస్థలపై తీవ్రనిర్బంధాలకుకూడా ఇదేసాకు చూపుతూంది," అని మాస్కో-రేడియో తెలిపింది.

జర్మనీలో బ్రిటన్ అమెరికాల ప్రవర్తన

మాస్కో, ఫిబ్రవరి 1

జర్మనీ విషయంలో పోట్సుడం నిర్ణయాలను తుచ తప్పకుండా అమలుజరపాలనీ, ఆ ప్రైసి ఆర్థికంగా, రాజకీయంగా జర్మనీని ఏక ఖండంగా పరిగణించాలనీ సోవియటు పట్టు బడుతుందని జర్మనీ సమస్యలపై సోవియటు నిపుణుడు మోసిన్ నిన్న ఒక సభలో వివరించాడు.

"ఈనాడు జర్మనీలో సోవియటు అధీన మండలంలోనే పోట్సుడం నిర్ణయాలు అమలుజరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాలన్నిటిలోనూ, ఎవరి ఇష్టంవచ్చినట్లు వారు ఆ నిర్ణయాలను భంగపరుస్తున్నారు.

"పడమటి జర్మనీలో (బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు అధీనంలో ఉంది.) గుత్తవ్యాపారం పెత్తనాన్ని తొలగించలేదు. యుద్ధ పరిశ్రమలకు ఉపయోగపడే వాటినికూడా నిర్మూలించలేదు. పోట్సుడం సమావేశంలో నిర్ణయించబడిన యుద్ధ నష్టపరిహార విధానాన్ని కూడా అమలు జరపడంలేదు. బ్రిటన్, అమెరికాలు జర్మనీ నుండి బంగారు విల్వల రూపంగానూ, ఇతర విధాలా ఇప్పటికప్పుడే వేయికోట్ల డాలర్లను గుంజారు.

"అంతేకాదు. జర్మన్ రాష్ట్రాలలో, జర్మనీ నుండి విడిపోవాలనే ఆందోళనను బ్రిటన్, అమెరికా అధికారులు రెచ్చగొడుతున్నారు. జర్మనీ ఏక ఖండంగాకాక, ఫెడరేషన్‌గా ఉండాలనే వాదనలను బయలుదేరదీశాయి. నాజీ నిర్మూలన కార్యక్రమాన్ని విసర్జించారు" అని మోసిన్ వివరించాడు.

అంతర్జాతీయ కమిటీ ప్రకటన

యూరప్ రాజకీయ పరిస్థితులను పరిశీలించడానికి నియమింపబడిన అంతర్జాతీయ కమిటీవారు జర్మనీలో ఇంకా మిగిలివున్న నాజీ విషబీజాలను గురించి ఇటీవల ఒక ప్రకటన చేశారు.

"బవేరియాలో (అమెరికా అధికారం క్రిందఉంది) బాహాటంగా వ్యవహరిస్తున్న ఇద్దరు రాజకీయ ప్రముఖులు చాల ప్రమాదకరమైన నాజీలని బయటపడింది. వీరి గత చరిత్ర అమెరికావారి మిలిటరీ గూఢచారి శాఖకు తెలియకుండా పోయిందా? లేక, తెలిసినా, వారికిలద్దుతగల్లకుండావిడిచిపెట్టారా?" అని ఈప్రకటన ప్రశ్నించింది. ముఖ్యమైన "నాజీ నిర్మూలన కార్యక్రమాన్ని అంత్యం చేయకూడదు" అని ఈ ప్రకటన హెచ్చరించింది.

వెట్టి నిరాకరించిన చాకలిపై దొంగకేసు బనాయింపు

రైతుల అండతో చాకలి విజయం

ఖమ్మం, జనవరి 30

గిర్దావరు (రెవిన్యూ ఇనస్పెక్టరు) పాతర్లపాడు గ్రామ పట్వారీ, కరణం యింట్లో మకాం వేశాడు. చాకళ్ళను పిలిపించి వెట్టి చేయించుట మొదలు పెట్టాడు. ఈ వెట్టి చేయలేక పాపం, ఆ నిరుపేదల తలప్రాణం తోకకు వచ్చింది.

కాని హుస్సేన్ అనే చాకలి యువకుడు యీ పాడు వెట్టి చేయడానికి నిరాకరించాడు. ఇతన్ని లొంగదీయటం ఎలా? పట్వారీ గిర్దావరులు కలసి కుట్రపన్నారు. ఒకనాడు పట్వారీ హుస్సేనును పిలిపించి "యివ్వాళ గిర్దావరుగారు నాగులంచ వెళ్ళుతున్నారు. బండి ఉంది కాని, తోలేమనిషి లేదు. నీకు కూలి యిస్తాము. వారిని నాగులంచలో దిగవిడచి రారా" అన్నాడు. అమాయకుడు హుస్సేన్ అంగీకరించాడు. గిర్దావరును నాగులంచ తీసుకొని వెళ్ళాడు. కాలి వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. మరునాడు తెల్లవారే సరికి నాగులంచనుంచి మనిషి పాతర్లపాడు దానేవచ్చాడు. "మా దొరగారి అల్లుడు నిన్ను గడికి రమ్మన్నారని చెప్పి" హుస్సేన్‌ను తనవెంట తీసుకువెళ్ళాడు.

హుస్సేన్‌ను చూడగానే గిర్దావరు వణ్లు వటవట కొరుకుతూ, "...కొడకా నిన్న పెట్టెలో ఉన్న పదిహేనుతులాల బంగారవు కంటె దొంగిలించి యెక్కడ దాచావురా" అని గద్దించాడు. హుస్సేన్ తెల్లపోయి "నాకేమి తెలియదుదొరా" అన్నాడు. చాకలిని చెట్టుకు అంటకట్టమని జమీందారుగారిఅల్లుడు ఆజ్ఞాపించాడు. దొరగారి నౌకర్లు-యమదూతలు-పాపమా దీనుణ్ణి చీమలున్నబాదం చెట్టుకు పెడరెక్కలు విరిచికట్టారు. చావు దెబ్బలుకొట్టి విడచిపెట్టారు.

24 తేదీన హుస్సేన్‌ను మళ్ళీ పిలిపించి చర్మరం చిట్లేవరకు కొట్టి, "రేపీపాటికి మా కంటె తెచ్చియివ్వకపోతే నీ ప్రాణాలు దక్కవని" బెదరించాడు. హుస్సేన్ ఇంటికి వచ్చి జరిగిన కథ అంతా చెప్పుతున్నాడు. చాకళ్ళ కడుపు మండిపోయింది. పోయి ఈ కథ అంతా తమ రైతులకు చెప్పుకొని, మాగతేమిటిబాబూ అన్నారు. సరే పదండి, మీతోపాటు మేమూ గడికి వస్తామన్నారు రైతులు. అంతాకలసి గడికివెళ్ళారు. గిర్దావరుకు, దొరగారి అల్లునికికాళ్లు చల్లబడ్డాయి. ఏమిన్ని తేలవేశారు. సరేపోండి అన్నారు. మర్నాడు మళ్ళీ బోనకాలుపోలీసుస్టేషన్‌కు పిలిపించారు. హుస్సేనును తమవెంట తీసుకొని గ్రామరైతులు, చాకళ్లు పోలీసుస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. మా చాకలి నిర్దోషి అని రైతులంతా ఒకే గొంతుకతో పలికారు. ఏ పాచిక కూడా పారలేదు. చాకళ్ళు యింట్లకు చేరుకున్నారు. దీనికంతా కారకుడు మహాతాంత్రికుడు అయిన గ్రామపట్వారీకి కూడా నేటినుంచీ వెట్టిచేయమని చాకళ్ళంతా శపథం పట్టారు.

కమ్యూనిస్టులు తప్ప మిగత ఖైదీలవిడుదల

నైజాం ప్రభుత్వ ప్రకటన

హైదరాబాదు, ఫిబ్రవరి 3

నైజాం ప్రజలంతా అసహ్యించుకున్న సంస్కరణలను ఆచరణలో పెడుతూ ప్రభుత్వం కొందరు ఖైదీలను విడుదలచేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నది. ఈ ఎన్నికలను స్టేటు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ మొదలైన ప్రజాసంస్థలు బహిష్కరించిన సంగతి పాఠకులెరుగుదురు.

ఈఎన్నికలలో ఏర్పడుతున్న అసెంబ్లీ సమావేశ ప్రారంభంలో మతకలహాలలోను, రాజకీయ నేరాలలోను శిక్షితులైన ఖైదీలను వదులుతున్నారు. కాని కమ్యూనిస్టుపార్టీమీద, తెలంగాణా ప్రజల మహాసంస్థ అయిన ఆంధ్రమహాసభమీద నిషేధం తొలగించము. ఆ ఖైదీలను వదలము అని ప్రభుత్వం ప్రకటించింది.

నల్లగొండ జిల్లాలోని ఇటీవల ప్రజా పోరాటంలో అరెస్టయినవారిలో 929 కి గాను 701 మందిని వదులుతారట.

కార్మికుల బర్తరఫ్ డిపాజిట్లు హరింపు

మోటారు యజమాని దుండగాలు

బెజవాడ, ఫిబ్రవరి 3

గోపాలకృష్ణా మోటారు ట్రాన్సుపోర్టు కంపెనీ మేనేజింగు డైరెక్టరు వీరమాచనేని శీతయ్యగారు, టి. రామిరెడ్డి, వి. కనకయ్య, హాషమ్, జి. వెంకటేశ్వరరావు మొదలగు మోటారు కార్మికులు యూనియన్‌లో సభ్యులుగా ఉన్నందుకు పనినుండి తొలగించాడు. దాసరి నరసింహారావు, గుర్రాల నారాయణరావులను బట్టుచేసి శలవు పెడితే తొలగించి తన తోడిల్లుడిని పనిలో పెట్టుకున్నాడు. షేక్‌జాన్, ప్రకాశరావు, రాధాకృష్ణమూర్తులకు జీతం అడిగినందుకు స్వస్తి చెప్పేడు. కండక్టర్ హుసేన్ డిపాజిట్ హరించాడు. షేక్ ఫరీద్ డిపాజిట్‌లో 20—0—0 హరించాడు. 805 డ్రైవరు తన విరోధితో మాట్లాడుతున్నాడనే నెపంతో తొలగించాడు. 72 డ్రైవరు డొగ్గు ఎక్కువ కాల్చాడనీ, అతని తమ్ముడయినందుకు 123 డ్రైవరును బర్తరఫ్ చేశాడు. ఎస్. సుబ్బయ్య అనే కండక్టరును, ప్లీడరు గుమాస్తా చేతిలోని రికార్డుకట్టను లగేజీ చెయ్యలేదని తొలగించాడు.

తన స్వంతపనిపై బస్సు బందరు తీసుకువెళ్ళి ఆకాలంలో బందరునుండి ప్యాసింజర్లనెక్కించి పంపి పోలీసు కేసుపెడితే తనకు తెలియదని వారి లైసెన్సులను రద్దుచేయించి జి. రాఘవయ్య, ఎస్. వెంకటేశ్వరరావులకు పనులు లేకుండా చేశాడు. 805 డ్రైవరుచేత ఓవర్‌లోడ్ వేయించి లైసెన్సు పోగొట్టి యింటికి పంపేడు. పి. నారాయణరావు, వి. రామలింగేశ్వరరావు, వి. చలపతిరావులు జీతం బాకీ అడిగినంతమాత్రంచేత డిస్మిస్ చేశాడు. ఈ రకంగా అనేక కేసులున్నాయి. కార్మికులు చాలా ఆందోళన చెందుతున్నారు.

ఈ నిరంకుశుని ఆటలు కట్టించాలంటే, అతని ఎత్తుగడలు భగ్నంచేసి, కార్మికుల ఐక్యం కావాలనీ, కార్మికులలో ఐక్యత చైతన్యం అరికట్టడానికే యిట్టి చర్యలు చేస్తున్నాడనీ, కాబట్టి కార్మికులుఐక్యతతో యీ మేనేజింగు డైరెక్టరుగారి ఆట కట్టించాలని కృష్ణాజిల్లా మోటారు కార్మికసంఘ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు జోస్యుల సత్యనారాయణగారు వ్రాస్తున్నారు.

Edited, Printed & Published by Katragadda Rajagopala rao at the Prajasakti Press, Moghalrajapuram, Bezwada. Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE